తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | మంగళవారం-09-డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 191 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్

TELANGANA RISING GLOBAL SUMMIT



**గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణ**
సింఎం రేవంత్‌కు ఆహ్వానం పలికిన రోబో
2లో

- రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- కొత్త రాష్ట్రం అయినా అభివృద్ధిలో దూకుడు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ మా లక్ష్యం
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది ఆశయం
- గాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలు
- క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్ అమలు
- అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములు
- పెట్టుబడులకు తెలంగాణ అన్ని విధాలుగా అనుకూలం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవంలో సింఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ అంటూ రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలనేదే తమ ఆశయమన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న ' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది తమ ఆశయమన్నారు. లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడి సాధిస్తామనే నమ్మకం మాకుంది. అందరి సహకారంతో మా లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణ భవిష్యత్ విజన్‌ను స్పష్టంగా వివరించారు. దేశ భవిష్యత్ కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేసి భారత రాజ్యాంగ నిర్మాతల దృష్టిని గౌరవించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.

మిగతా 2లో





## అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

సమ్మిట్‌ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్ష

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

నెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా ప్రారంభమైంది. సమ్మిట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు.సోమవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ వర్మ మాట్లాడుతూ.. తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం దోహదపడుతోందని గవర్నర్ పేర్కొన్నారు.

మిగతా 8లో

## హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం

- ఐటి, ఇన్నోవేషన్, ఫార్మా, ఏరోస్పేస్ టెక్నాలజీలకు కేంద్రం
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీనిపెంచేందుకు కలసికట్టుగా కృషి
- రాష్ట్రాల సహకారంతోనే వికసిత భారత్ కల సాకారం
- ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరణ
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2లో




## బెంగుళూరుతో పోటీ పడుతున్న హైదరాబాద్

- తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో డికె ప్రశంసలు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో హైదరాబాద్ బెంగళూరు నగరం పోటీపడుతోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఈ రెండు మహానగరాలూ ప్రపంచంతో పోటీపడుతున్నాయన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో

మిగతా 2లో





## ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

**క్యాట్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే**

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

ఏఎస్ అధికారి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలికి సూచించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో కేంద్ర సిబ్బంది,

మిగతా 2లో

## రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్

- అబద్దాలే ఆయన శ్వాసగా పాలన
- రేవంత్‌ది ప్రైవేట్ లిమిటెడ్ పాలన
- రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత ఏదీ
- రెండేళ్ల పాలనపై బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అని, ఆయన ఏం మాట్లాడినా అబద్ధమే అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రెండేండ్ల పాలనలో దోపిడీ తప్ప పారదర్శకలేదని, ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ చేసిందేమీ లేదని మండిపడ్డారు.

మిగతా 8లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్

(మొదటి పేజీ తరువాయి)

మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలని ఆయన అన్నారు. విడిపోయిన తర్వాత ప్రజా పోరాటంతో సాధించిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ 2014లో సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో భారత పటంలో చోటు చేసుకుందని గుర్తు చేశారు. గత దశాబ్దంలో రాష్ట్రం అత్యధిక అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుతో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను సిద్ధం చేసినట్లు సీఎం వెల్లడిరచారు. ఈ డాక్యుమెంట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించబడిరదని, నీతి ఆయోగ్, నిపుణుల సూచనలు ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నా.. దేశ జిడిపిలో 5 శాతం వాటా సాధించిన తెలంగాణ 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర అభివృద్ధి కోసం మొదటిసారి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్‌ను అమలు చేస్తున్నామన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని.. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల పోటీ స్థాయికి తెలంగాణను తీసుకెళ్లే ప్రణాళిక ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములని.. వారికి ఈ సందర్భంగా ఆహ్వానం పలుకుతున్నట్లు సీఎం అన్నారు. కష్టం అయితే వెంటనే చేయండి.. అసాధ్యమైతే డెడ్‌లైన్ పెంచుతాం అని సందేశం ఇచ్చారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు.

దేశ స్వాతంత్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నామన్నారు.తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. రానున్న పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి.. 2047లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని.. నాటికి మనం ఏం సాధించామో చెప్పాలని నిపుణులను కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్`2047 దార్శనికతకు బీజం పడిరదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం? ప్రజల మద్దతు కోరుతామన్నారు. భవిష్యత్తు కోసం మన కలలు నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నామన్నారు. అందుకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు.ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం రేవంత్ ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాష్ట్రాన్ని.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తాము సంకల్పించామని చెప్పారు.




దేశంలో తెలంగాణ దాదాపు 2.9శాతం జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5శాతం వాటాను అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం.. ఇలా తెలంగాణను మూడు భాగాలుగా విభజించి.. ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిరచు కున్నామని వివరించారు. ఇలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మొట్టమొదటిదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందుకోసం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ మోడల్స్ నిర్దేశించామని చెప్పారు.

ఈ సందర్భంగా చైనాలోని గ్వాంగ్`డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. చైనాలోనే ఈ ప్రావిన్స్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని తెలిపారు. 20 ఏళ్లలో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులతోపాటు వృద్ధి రేటు సాధించారని వివరించారు. తెలంగాణలో సైతం తాము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నామని చెప్పారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి తామేంతో ప్రేరణ పొందామన్నారు. ప్రస్తుతం ఆయా దేశాలతో తాము పోటీ పడాలనుకుంటున్నామని తెలిపారు. ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు.. కానీ ఆ విజన్‌ను సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమ టీమ్‌కు తాను చెప్పేదొక్కటేనన్నారు. కష్టంగా ఉంటే..వెంటనే చేపడుదాం. అసాధ్యం అని అనుకుంటే.. వారికి కొంత గడువు ఇస్తానని పేర్కొన్నారు. ఇవాళ తాను నిన్నటి కంటే ఎక్కువ విశ్వాసంతో, నమ్మకంతో ఉన్నానన్నారు. నిన్నటిది ఒక కల, ఒక ప్రణాళిక? ఇవాళ మీరందరూ తమతో చేరారని.. ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా విశ్వసిస్తున్నానన్నారు. ఈ తెలంగాణ రైజింగ్ నిరంతర పక్రియ..అంటూ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తూ.. తన ప్రసంగాన్ని ముగించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం అనంతరం ఈ సమ్మిట్ ప్రారంభ వేడుకలు ముగిశాయి. ఆనంతరం వివిధ రంగాలపై సదస్సులు ప్రారంభమైనాయి. సెమీకండక్టర్ రంగంపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. విద్యా రంగంలో గ్లోబల్ సెంటర్‌గా తెలంగాణ చర్చ గోష్టిలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

# హైదరాబాద్ దేశ అర్థిక వ్యవస్థకు మూలస్తంభం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):



హైదరాబాద్ కేవలం ఓ రాష్ట్రానికి రాజధాని నగరం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం లాంటిదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఐటీ హబ్‌గా, ఇన్నొవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరో స్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా వర్ధిల్లుతోంది. ఈ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరమూ కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా వెలుగొందాలని తరచూ ప్రధాని మోదీ పిలుపునిస్తూ ఉంటారు. అయితే రాష్ట్రాల సహకారంతోనే ఈ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అనేక విషయాలపై మాట్లాడారు. హైదరాబాద్ నగరం అంటేనే సాంకేతికతో సంప్రదాయం, శాస్త్ర పరిజ్ఞానంతో ఆధ్యాత్మికత, వారసత్వ సంపదతో సృజనాత్మకత కలగలిసి ఉంటాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన 2014లోనే మార్పు, పారదర్శకత నినాదంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరించింది. పేదరిక నిర్మూలన, డిజిటల్ సాధికారత, వడివడిగా మౌలికవసతుల కల్పన, రైతుల సంక్షేమం, స్టార్టప్స్ కు ప్రోత్సాహం ఇలా అన్ని రంగాల్లో మున్ముందుకు సాగిపోతోందన్నారు. పరిశ్రమలను, స్టార్టప్స్ ను, టాలెంట్ ను, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్రాలు పోటీ పడాలి. రాష్ట్రాల మధ్య సుహృద్భావ పోటీతోనే ప్రమాణాలు పెరగడంతో పాటు సంస్కరణలకు వీలు కలుగుతుందని.. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియచేశారు. 2014 నుంచి 25 వరకు 748.78 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే ఏకంగా 143 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పాలన పెరిగింది. దీంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగింది. భారత్‌ను పెట్టుబడులకు సురక్షితమైన దేశంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులు భావిస్తున్నారు. 'ఆత్మ నిర్భర్ భారత్', 'మేకిన్ ఇండియా' ద్వారా భారత్ మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా అవతరించింది. 2014లో రెండు యూనిట్లు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య ఏకంగా 300 యూనిట్లకు పెరిగింది. రక్షణ రంగం ఎగుమతులు 2013`14లో రూ.686 కోట్లు ఉండగా, ఇప్పుడు 34 రెట్లు పెరిగి ఏకంగా రూ.23,622 కోట్లకు ఎగబాకాయి. ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు 2014లో 74 ఉండగా, ఇప్పుడు అది రెట్టింపై 160కి పెరిగాయి. రైల్వే క్యాపిటల్ పెట్టుబడులు, మెట్రో నెట్ వర్క్ భారీగా పెరిగాయి. గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంది. గ్లోబల్ నార్త్, గ్లోబల్ సౌత్ కు మధ్య వారధిగా, పెద్దన్న పాత్ర పోషిస్తోందని వివరించారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పన్నుల, గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల రూపంలో రూ.10 లక్షల కోట్లకు పైగా నిధులను అందించింది. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు కేటాయించి, కారిడార్లు, రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారులు, ఎకనామిక్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. రైల్వే కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు, ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ వంటి పనుల కోసం రూ.32 వేల కోట్లు కేటాయించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో రూ.2,500 కోట్లతో 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తొలి దశ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రామగుండంలో రూ.11 వేల కోట్లతో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల కొత్త థర్మల్ పవర్ ప్లాంటు నిర్మించాం. మరో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లు నిర్మించేందుకు ఎన్టీపీసీ సిద్ధంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. వరంగల్ లో పీఎం మిత్ర టెక్స్ టైల్ పార్కు ద్వారా లక్ష మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. రూ.2300 కోట్లతో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ ను అభివృద్ధి చేస్తున్నాం. ఎయిమ్స్ బీబీనగర్, ఐఐటీ హైదరాబాద్, డీఆర్ డీవో, హెచ్ఏఎల్, బీడీఎల్, మిదాని వంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయి. ఇవన్నీ కూడా తెలంగాణను దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుతం దేశంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఉంది. త్వరలోనే మూడో స్థానానికి ఎగబాకుతుందనడంలో సందేహం లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు ముఖ్యంగా హైదరాబాద్ కు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణ

## సిఎం రేవంత్‌కు ఆహ్వానం పలికిన రోబో



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):


భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్`2025 ప్రారంభమైంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన అతిథులకు స్వాగతం పలకడంతో పాటు గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను అందరికీ వివరిస్తోంది రోబో. ఇక గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా రోబో హాయ్ అంటూ పలకరించింది. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఈ రోబో అందరినీ ఆకట్టుకుంటోంది. అలాగే గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం పరిశీలించారు. ముఖ్యమంత్రితో సినీ నటుడు నాగార్జున కూడా ఉన్నారు. అతను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్లోబల్ సమ్మిట్ ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ రంగాలకు చెందిన దేశ, విదేశాల ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ రైజింగ్‌పై ప్రత్యేకంగా రూపొందించిన సాంగ్‌ను వేదికపై ప్రదర్శించారు.



# ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ వ్యవహారాల శాఖ డీవోపీటీ ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని ఆమె క్యాట్‌లో సవాలు చేశారు. దీంతో ఆమ్రపాలిని తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో క్యాట్ ఉత్తర్వులను డీవోపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీలు చేసింది. ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదని డీవోపీటీ వాదించింది. హరికిరణ్ రిజర్వ్ కేటగిరీ కాబట్టి ఆయనతో ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదని వివరించింది. ఈ క్రమంలో క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



# బెంగుళూరుతో పోటీ పడుతున్న హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)



ఆయన ప్రసంగించారు. తర్వాత తరానికి ఏం కావాలో ఈ ప్రభుత్వం ఆలోచించిందని అన్నారు. తెలంగాణ, సౌత్ ఇండియా అభివృద్ధికి కర్ణాటక సహకరిస్తుందన్నారు. దేశ ఐటీ ఎగుమతుల్లో బెంగళూరు 40 శాతం కలిగి ఉంది. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గొప్ప వాటా కలిగి ఉంది. కాలిఫోర్నియా వంటి నగరాల్లో 13 లక్షల భారత ఇంజినీర్లు పని చేస్తున్నారని శివకుమార్ తెలిపారు.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్: బొల్లెపాక రాజేష్


# కీసరలో అంబేద్కర్ 200వ జ్ఞానమాల కార్యక్రమం

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తోటకూర వజ్రెష్ యాదవ్



**కీసర, డిసెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో 200వ జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన "అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్త మాత్రమే కాదు, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన ఘన నివాళి" అన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను అవగాహన చేసుకొని విద్య, సామాజిక చైతన్యం, హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో దమ్మైయిగూడ మున్సిపల్ అధ్యక్షులు ముప్పు రామారావు, కీసర మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ బక్కని నర్సింగ్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు, కీసర మండల అంబేద్కర్ సంఘపదవిదారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఫోటోగ్రాఫర్ నవీన్‌కి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం గ్రామం కి చెందిన నవీన్ జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో గోల్డ్ మెడల్ దక్కింది. మొదటి నేషనల్ లెవెల్ ఫోటోగ్రఫీ నిర్వహించిన తెలుగు ఆర్ట్ ఫోటోగ్రాఫి మరియు వివిడ్ ఫోటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన ఫోటోగ్రఫీ వర్క్ షాప్ గాంధారి జీవన విధానా శైలి మీద మదర్ అండ్ చైల్డ్ ఛాయాచిత్రం తీసిన ఫోటోకు ప్రముఖ ఫోటోగ్రాఫర్ శ్రీ నవీన్ జాతీయ స్థాయి మొదటి బహుమతి, మేమిటో గోల్డ్ మెడల్ సాధించారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ తమిళనాడు కర్ణాటక మహారాష్ట్ర ఒరిస్సా సహా పలు రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా ఫోటోగ్రాఫర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో దిగ్గజ ఫోటోగ్రాఫర్లతో పోటీ పడిన నవీన్ బహుమతి లభించడం విశేషం గతంలోనూ జాతీయ స్థాయి పోటీల్లో నవీన్ నగదు పురస్కారాలు గెలుచుకున్నారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ బహుమతి రావడం పట్ల జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు. విశాల బంగారం నేలకొండపల్లి ఎస్సై సంతోష్ నవీన్ ని అభినందించారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనే మా లక్ష్యం

- టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి, పత్రిక కు అనుబంధ కాదు
- గత రాష్ట్ర, జిల్లా కమిటీలన్నీ రద్దు
- త్వరలో నూతన రాష్ట్ర, జిల్లా కమిటీల ఏర్పాటు
- వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య



**ఖమ్మం బ్యూరో,డిసెంబర్ 08(తెలంగాణ ముచ్చట్లు):** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు సాధించేవరకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నిరంతరం పోరాడుతుందని ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మంలోని కోణార్క్ హోటల్‌లో సంతోష్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ పట్ల కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మామిడి సోమయ్య తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులను అయోమయానికి గురి చేసేందుకు, సంఘం తమదే అన్నట్లుగా కొందరు మాజీ నాయకులు చేస్తున్న ప్రచారాలను జర్నలిస్టులు నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్‌లోని వ్యవస్థాపక సభ్యులు అన్ని జిల్లాలు తిరుగుతూ సంఘం బలోపేతానికి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో కూడా సంఘాన్ని బలోపేతం చేయడానికి త్వరలో జిల్లా మహాసభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.


రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ జర్నలిస్టుల ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధమవుతుందని హెచ్చరించారు. జర్నలిస్టుల పక్షాన నిలబడి సమస్యలపై నిరంతరం పోరాటం చేసే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఐఎఫ్‌డబ్ల్యుజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఐఎఫ్‌డబ్ల్యుజే నిరంతరం పోరాడుతోందని అన్నారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ తీసుకుంటున్న ప్రతి నిర్ణయం పూర్తిగా జర్నలిస్టుల సంక్షేమం కోసమేనని మామిడి సోమయ్య మరోసారి స్పష్టం చేశారు. ఎలాంటి రాజకీయ పార్టీ ప్రభావం లేకుండా, పూర్తిస్థాయి స్వతంత్రతతో టీడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తోందని చెప్పారు. గతంలో కొందరు సంఘం పేరును దుర్వినియోగం చేసి వ్యక్తిగత ప్రయోజనాలు పొందేందుకు యత్నించారని విమర్శించారు. ఇకపై అలాంటి వాటికి తావులేకుండా క్రమశిక్షణాత్మక విధానాలతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంతో పాటు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, వేతన భద్రత, వృద్ధాప్య పెన్షన్, అక్రెడిటేషన్ విధానాల్లో పారదర్శకత వంటి అంశాలపై కూడా ప్రభుత్వ స్థాయిలో సమగ్ర పోరాటం చేపడతామని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపై త్వరలో ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించడంతో పాటు వివిధ దశల్లో ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ఖమ్మం జిల్లా జర్నలిస్టులు సంఘ పునర్నిర్మాణంలో చురుకుగా పాల్గొని బలమైన కమిటీ నిర్మాణానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లా కమిటీల్లో యువ జర్నలిస్టులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని, అనుభవజ్ఞులైన సీనియర్ జర్నలిస్టుల సలహాలు, మార్గదర్శకత్వంతోనే సంఘాన్ని ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల సాధన కోసం చిన్న పెద్ద పత్రికలతో పాటు అందరూ జర్నలిస్టులు తమతో కలిసి రావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరైన జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ లక్ష్యాలను స్వాగతిస్తూ పూర్తి మద్దతు ప్రకటించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం తీసుకునే ప్రతి పోరాటంలో

భాగస్వాములుగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశం చివర్లో సమిష్టి ఉద్యమంతోనే జర్నలిస్టుల హక్కులను సాధించగలమని నినాదాలు చేస్తూ సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు అడ్‌హాక్ కమిటీని ప్రకటించారు. ఖమ్మం జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ కన్వీనర్‌గా టీ. సంతోష్ చక్రవర్తి, కోకన్వీనర్లుగా అర్వపల్లి నగేష్, అంతోటి శ్రీనివాస్, నానబాల రామకృష్ణ, వందనపు సామ్రాట్‌లను రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఇప్పటివరకు ఉన్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీలన్నీ రద్దు చేసినట్లు, త్వరలో కొత్త రాష్ట్ర కమిటీతో పాటు అన్ని జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం సత్తుపల్లి కి చెందిన సీనియర్ రిపోర్టర్ దమ్మాలపాటి సత్యనారాయణ మృతికి సంతాపం ప్రకటించారు.

ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కోకన్వీనర్లు వల్లాల జగన్, జి. వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి. గోపాల్, పాల్వాయి జానయ్య, రఘురాం, సాదిక్ పాషా, న్యాయ సలహాదారులు పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్‌గా చిల్లంచర్ల కృష్ణవేణి



**ఉప్పల్, డిసెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు) :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యాచరణ కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చిల్లంచర్ల కృష్ణవేణి నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ చైర్మన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేస్తూ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చిల్లంచర్ల కృష్ణవేణి మాట్లాడుతూ— రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించినందుకు చైర్మన్ మాధవ్‌కి, నా నియామకానికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండ కి ధన్యవాదాలు తెలిపింది. మానవ హక్కుల పరిరక్షణలో బాధితులకు అండదండగా నిలిచి, న్యాయం కోసం నిరంతర పోరాటం చేస్తానని స్పష్టం చేసింది.తన దృష్టికి వచ్చే సమస్యలను పరిష్కరిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని, అలాగే సంస్థ చేపట్టే కార్యక్రమాల విజయవంతానికి పనిచేస్తానని ఆమె తెలిపింది. మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు పాత్రను పోషిస్తానని కృష్ణవేణి పేర్కొన్నారు.పదవి స్వీకరణ సందర్భంలో సంస్థ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు చిల్లంచర్ల కృష్ణవేణిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



# గౌడ కుల సంఘ మద్దతు కోరిన బీఆర్ఎస్ అభ్యర్థి మరిజె అనిత నర్సింహారావు


**వేలేరు, 08 డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచ్ అభ్యర్థి మరిజె అనిత నర్సింహారావు గౌడ కుల సంఘ నాయకులను ప్రత్యేకంగా కలిసి మద్దతు కోరారు. పీచర గ్రామ అభివృద్ధి కోసం తమను విశ్వసించి గెలిపించాలని, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా గౌడ సంఘ పెద్దలు ఆమెను స్వాగతిస్తూ గ్రామంలో బోరు, లైటింగ్, మైకు, కమిటీ హాలు,అమలు వంటి సమస్యలను వివరించారు. మరిజె అనిత ప్రతి సమస్యను శ్రద్ధగా విని పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గౌడ సంఘం కులస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామం మొత్తం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.

# సీరియల్ నటుడు సెల్వరాజ్ ప్రచారం



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8,(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం అనంతసాగరం గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా పత్తిపాటి లక్ష్మీకాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని ప్రముఖ బుల్లితెర సినీ నటుడు సెల్వరాజ్ (చక్రవాకం ఫేమ్ ఇక్బాల్ ) ఓటర్లను అభ్యర్థించారు.

# బలవంతంగా కండువాలు కప్పడం సరికాదు



**వేలేరు, 08 డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడి పెరుగుతోంది. గ్రామంలో ప్రచారంలో భాగంగా ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు పేరుతో బలవంతంగా కండువాలు కప్పుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా మాత్రమే మద్దతు తెలపాలని, బలవంతపు చర్యలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని గట్టిగా పేర్కొన్నారు. గ్రామంలో మద్దతు పేరుతో గౌడ సంఘం నాయకులకు కండువాలు కప్పే ప్రయత్నాలు జరుగుతుండగా, ఈ విషయంలో గ్రామ ప్రముఖుడు మంతపురి రాజు స్పందిస్తూ, ఎవరి అభిమతానికి విరుద్ధంగా కండువాలు కప్పడం సరికాదని హెచ్చరించారు. ఎన్నికలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా జరగాలని కోరుతూ, ప్రజాస్వామ్య విధానాలను గౌరవించాలని సూచించారు. గ్రామ ప్రజలు కూడా ఈ చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎన్నికల నియమాలను ఖచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారి వర్గాలను కోరారు. ఎన్నికల సమయంలో ఎవరికీ ఒత్తిడి లేకుండా తాము కోరిన అభ్యర్థులను ఎంచుకోవడానికి స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# నేతాజీ గెలుపు నేరడ అభివృద్ధికి మలుపు

- **మా ఇంటి బిడ్డను ఆశీర్వదించండి**
- **నేరడ రోడ్ షోలో మల్లు నందిని, కూనంనేని**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** నేతాజీ గెలుపుతో నేరడ గ్రామ పంచాయతీ అభివృద్ధి మలుపు తిరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినీ విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నేరడ గ్రామపంచాయతీ సిపిఐ అభ్యర్థి దూసరి నేతాజీ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం నేరడ గ్రామంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినీ విక్రమార్క. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్ షో లో కూనంనేని మాట్లాడుతూ నేతాజీ గెలుపుతోనే నేరడ అభివృద్ధి చెందుతుందని గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే నేతాజీ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దాదాపు నేతాజీ గెలుపు ఖాయమైందని మంచి మెజార్టీ కోసం ఈ మూడు రోజులు అవిశ్రాంతంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. మల్లు నందిని మాట్లాడుతూ. అధికార పార్టీ బలవర్చిన సిపిఐ అభ్యర్థి నేతాజీ ని గెలిపిస్తే ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. నేరడ గ్రామంతో తమకు ప్రత్యేక అనుభంధం ఉందని నేతాజీ మా ఇంటి బిడ్డ అని నేతాజీని భారీ మెజార్టీతో గెలిపిస్తే నేరడ అభివృద్ధి భాధ్యత తనదేనని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, నాయకులు మడుపల్లి భాస్కర్, మంకెన నాగేశ్వరరావు, మేడ నర్సయ్య కాంగ్రెస్, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో 114 ఫిర్యాదులు స్వీకరణ

- **సకాలంలో సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు కలెక్టర్**

**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, డిసెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 114 అర్జీలు అందాయని ఆయన తెలిపారు.సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో అందిన వినతులపై తీసుకున్న చర్యలను వివరించి, ఒన్లైన్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆన్లైన్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాల్సిన అవసరాన్ని చెప్పారు. అర్జీలను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు.అదనంగా, సీఎంఓ ప్రజావాణి పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలి అని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## ఏసీపీ వసుంధర యాదవ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు.చింతకాని మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులకు స్థానిక ప్రజలకు,రాజకీయ నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు.సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ అభ్యర్థులందరూ సామరస్య పూర్వకంగా ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు.నియమ నిబంధనలు పాటించకపోతే కేసులు సైతం నమోదు అవుతాయని తెలిపారు. అభ్యర్థులందరూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు జరుపుకోవాలని,ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సూచించిన సమయంలోనే సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికలు, ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు గాని సమావేశాలకు గాని అనుమతి లేదని,ఇది గమనించి అందరూ సహకరించాలని అన్నారు.ఈ సమావేశంలో ఏసీపీ సాంబరాజు,సిఐ వెంకటప్రసాద్,ఎస్సై వీరేందర్ పాల్గొన్నారు.



# జిహెచ్ఎంసి అధికారులతో అభివృద్ధి పనులు వేగవంతంపై సమీక్ష కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, డిసెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ చిల్కానగర్ డివిజన్లో పెండింగ్లో ఉన్న అన్ని అభివృద్ధి పనులకు తక్షణమే నూతన ప్రతిపాదనలు సిద్ధం చేసి జాప్యం లేకుండా అమలు చేయాలని జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులకు కార్పొరేటర్,జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆదేశించారు.బన్నాల గీతా ప్రవీణ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పెండింగ్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే టెండర్ అయిన పనులకు శంకుస్థాపన జరిపి వెంటనే కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభించాలనీ, కొత్తగా ఆమోదితమైన పనులకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని ఆమె సూచించారు. సమీక్షలో భాగంగా మల్లికార్జున్ నగర్ కాలనీ, చిల్కానగర్ గుట్ట ప్రాంతాల్లో స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ అవుట్లెట్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. అదే విధంగా ఆదర్శనగర్ మోడల్ గ్రేవ్యార్డ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.చిల్కానగర్ చౌరస్తా వివేకానంద విగ్రహం నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు రూ.6 కోట్లు వ్యయంతో నిర్మించనున్న 1000 ఎంఎం డయా స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనుల శంకుస్థాపనకు సంబంధిత ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు.పలు బస్తీల్లో సిసి రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్స్, కమ్యూనిటీ హాల్స్ కోసం నూతన ప్రతిపాదనలు ఆలస్యం చేయకుండా పూర్తి చేసి పంపించాల్సిందిగా సూచించారు. మల్లికార్జున్ నగర్ కాలనీలో నాచారం చెరువు నుండి వచ్చే ఓవర్ ఫ్లోర్ వాటర్ ట్రంక్ లైన్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.డివిజన్లో మిగిలిన ఉద్యానవనాల్లో ఓపెన్ జిమ్లు, పిల్లల ఆటపరికరాల ఏర్పాటు కోసం కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న సివిల్ వర్క్స్, సిసి రోడ్ల నిర్మాణ పనులను అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆమె తెలిపారు. సమీక్ష సమావేశంలో డీఈ వెనెల్ గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ విజయ వరంపరను కొనసాగించండి

- **ఆవుల నర్సింహారావును భారీ మెజార్టీతో గెలపించాలి.**
- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** బస్వాపురం గ్రామపంచాయతీలో సిపిఐ విజయ వరంపరను కొనసాగించి ఆవుల నర్సింహారావు ను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు బస్వాపురం ఓటర్లను కోరారు. సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ఆవుల నర్సింహారావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం బస్వాపురం గ్రామంలో కూనంనేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బస్వాపురంలో గత రెండు దశాబ్దాలుగా సిపిఐ పార్టీ గెలుస్తుందని తిరిగి నర్సింహారావును గెలిపించి సిపిఐ వందేళ్ల వేడుకకు కానుకగా ఇవ్వాలని కోరారు. బస్వాపురంలో ప్రతి ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను ఆదర్శిస్తున్నారని అభివృద్ధే ధ్యేయంగా గత ఇరవై ఏళ్లుగా సిపిఐ సర్పంచ్ లు ఆవుల సైదులు, ఆవుల నర్సింహారావు, బొడ్డు సుగుణమ్మ, రాసాల సాంబలక్ష్మి బస్వాపురం అభివృద్ధిలో తమదైన ముద్ర వేశారని, యువకుడు, స్నేహశీలి నర్సింహారావును అత్యధిక మెజార్టీతో గెలిపించి తిరిగి బస్వాపురం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు వచ్చే పగటి వేషగాళ్లను నమ్మవద్దని అభివృద్ధికోసం, ప్రజా సమస్యల కోసం కృషి చేసే నర్సింహారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తటి వెంకటేశ్వర్లు, పావులూరి మల్లిఖార్జునరావు, పగడాల మల్లేష్, జిల్లా సమితి సభ్యులు రాసాల మోహన్ రావు,, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ, మాజీ సర్పంచ్ లు బొడ్డు సుగుణమ్మ కొండలరావు, రాసాల సాంబలక్ష్మి, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, మామిడాల యాలాద్రి ఉయ్యాల బోడయ్య, పొట్టపల్లి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# నాచారం ఐడీఏలో మహిళా కార్మికులు ధర్నా

- **వేధింపులు ఆపాలి ,కనీస వేతనం పెంచాలి**
- **ఓటీ మొత్తం చెల్లించాలి**

**నాచారం, డిసెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు) :** నాచారం పారిశ్రామిక వాడలోని షాహీ టెక్స్టైల్స్ ఎక్స్పోర్ట్ యూనిట్ ఎదురుగా సోమవారం ఉదయం నుంచి సుమారు వెయ్యికి పైగా మహిళా కార్మికులు అకస్మాత్తుగా మెరుపు ధర్నా చేపట్టారు.పరిశ్రమలో జరుగుతున్న వేధింపులను అరికట్టాలని, కనీస వేతనం రూ.15,000 అమలు చేయాలని, చేసిన ఓవర్టైమ్ మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు.కార్మికుల ఆందోళనకు సంఘీభావంగా సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు కోమటి రవి హాజరై మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానాలను దృష్టిలో ఉంచుకొని కనీస వేతనం రూ.26,000 కన్నా తక్కువ కావొద్దని పేర్కొన్నారు. తరువాత కార్మికుల సమక్షంలో హెచ్ఆర్ ప్రతాపరెడ్డి, మేనేజర్ స్వప్నతో చర్చలు జరిగాయి. ఓటీ బకాయిలను సమీక్షించి చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. వేధింపులపై విచారణకు అంగీకరించినా, వేతన పెంపు విషయంలో నిర్ణయం వెల్లడించలేదు.

ఈ సమాధానంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వేతనం పెంచే వరకు ధర్నా కొనసాగిస్తామని ప్రకటించారు.

అంతకుముందు యాజమాన్యంతో చర్చలకు వెళ్లిన కార్మిక సంఘం కమిటీ సభ్యులకు ప్రమోషన్ల రూపంలో ప్రలోభాలు ఇచ్చారని కార్మికులు ఆరోపించారు.ధర్నాకు సంఘీభావం తెలుపుతూ

సీఐటీయూ, ఏఐటీయూసీతో పాటు మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్లు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సీఐటీయూ అశోక్ రెడ్డి, ఉపేందర్, ప్రభాకర్, ఏఐవైఎఫ్ గిరిబాబు, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ స్వప్న, ఏఐఎస్ఎఫ్ హాజీమ్ తదితరులు పాల్గొన్నారు.



# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ -08,(తెలంగాణ ముచ్చట్లు):** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోడౌన్ లోపలి గోడలపై క్రాక్ లను చూసి, వర్షపు నీటికి చెమ్మ రాకుండా, తడి లేకుండా ఉండే విధంగా చూడాలని వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈవిఎంల భద్రత ముఖ్యమైనదని తెలిపారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఏ ఇ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కోడిరెక్క ఉమాశంకర్, బిజెపి పార్టీ ప్రతినిధి జి. విద్యాసాగర్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు ఉన్నారు.



## గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో

# మద్యం దుకాణాలు బంద్

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్-08(తెలంగాణ ముచ్చట్లు):** డిసెంబర్ 11, 14, 17 తేదీలలో జరిగే మూడు విడతల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిసెంబర్ 11 న జరిగే మొదటి విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 9 వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 11న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలన్నారు.

అదే విధంగా డిసెంబర్ 14 న జరిగే రెండో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 12 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 14న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ అన్నారు.

డిసెంబర్ 17 న జరిగే మూడో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 15 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 17న ఎన్నికల ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూర్, సింగరేణి మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ తెలిపారు.

మద్యం దుకాణాలతో పాటు పై తేదీలలో ఆయా మండలాల్లో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో , డిసెంబర్-08(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల నియమావళి ఖచ్చితంగా పాటిస్తూ, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 11, 14, 17న మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, రాబోయే 8 రోజులు ముందస్తు ప్రణాళికతో సజావుగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత మండలంలో రిపోర్ట్ చేయని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు రిటర్నింగ్ అధికారులు సకాలంలో హాజరు కావాలని అన్నారు.

ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ బృందాలు ఏర్పాటు చేశామని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్దకు సకాలంలో పోలింగ్ బృందాలు చేరుకోవడంతో పాటు సంబంధిత రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రిజర్వ్ పోలింగ్ బృందాలు తప్పనిసరిగా విధులకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. పోలింగ్ నాడు పూర్తి స్థాయిలో రిజర్వ్ బృందాలు డిఆర్సి లో అందుబాటు లో ఉండాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలు విశాలంగా ఏర్పాటు చేయాలని, అక్కడ సిబ్బంది భోజన ఏర్పాట్లు ప్రత్యేకంగా చేయాలని కలెక్టర్ సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన టాయిలెట్స్, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డ్స్, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు.

174 పోలింగ్ లోకేషన్ లో 992 పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ఏర్పాట్లు పక్కాగా జరిగేలా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, విద్యుత్ సరఫరా, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ఎక్కడైనా చిన్న, చిన్న మరమ్మత్తులు ఉంటే వెంటనే చేయించాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వారికి ఓటు హక్కు ఉన్న మండల ఎంపిడిఓ కార్యాలయాలకు వెళ్ళి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు కోవాలని, ఈ పోస్టల్ బ్యాలెట్ లను సంబంధిత గ్రామాలకు పంపే విధంగా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలు సిద్ధం చేశామని, వీటిని సరైన సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని, వాహనాలు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అవసరమైన మేర అందుబాటులో ఉండేలా మండల స్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి. బృందాలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. స్థానిక పోలీస్ అధికారులతో తహసిల్దార్ సమన్వయం చేసుకుంటూ అవసరమైన చోట అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర బడ్జెట్ మొదటి దశ ఎంపిడిఓ లకు విడుదల చేశామనిఅన్నారు. ఎన్నికల సిబ్బంది టిఎ, డీఏ, భోజన ఖర్చులకు అవసరమైన నిధులు విడుదల చేశామని ఎక్కడ కూడా సిబ్బంది నుంచి ఫిర్యాదు రావడానికి వీలు లేదని, ఎన్నికల సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని అన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల సందర్భంగా సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్- 08(తెలంగాణ ముచ్చట్లు):** పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వాణిజ్య సంస్థ, దుకాణం, వ్యాపార సంస్థలలో పనిచేసే కార్మికులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో పోలింగ్ కోసం ఉపయోగిస్తున్న కార్యాలయ, విద్యా సంస్థల భవనంలో ఉన్న సిబ్బందికి, విద్యార్థులకు ఎన్నికల ముందు రోజు డిసెంబర్ 10న, అలాగే రెండవ దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో డిసెంబర్ 13న, మూడో దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో డిసెంబర్ 16న లోకల్ హాలిడే, ఎన్నికల రోజున ఎన్నికలు జరిగే ప్రాంతాలలో స్థానికంగా సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. దుకాణ, వాణిజ్య సంస్థల యజమానులకు, వ్యాపార సంస్థల యజమానులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థను బలంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయి...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ -08 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రానైట్ రంగం నిలబడితే వేల కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, త్వరలోనే పరిశ్రమ ప్రతినిధులతో విస్తృత సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక ఖానాపురం లోని ఇండస్ట్రియల్ కాలనీ గ్రానైట్ పారిశ్రామిక ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించి పరిశ్రమల స్థితిగతులను, పరిస్థితులను క్షేత్ర స్థాయిలో తిరుగుతూ పరిశీలించారు. పలు గ్రానైట్ యూనిట్లలో జరుగుతున్న ఉత్పత్తి, ప్రాసెసింగ్ పనులపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూనిట్ నిర్వాహకులు, పారిశ్రామిక వేత్తలు, కార్మికులతో కలెక్టర్ సంభాషిస్తూ పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. విద్యుత్ ఛార్జీలు, ఎగుమతి సమస్యలు, మార్కెట్ డిమాండ్ తగ్గుదల, ముడి సామగ్రి రవాణా వ్యయాల పెరుగుదల వంటి పలు అంశాలపై కలెక్టర్ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఉన్న గ్రానైట్ పరిశ్రమకు పునరుద్ధరణ మార్గాలు చూపించే దిశగా ప్రభుత్వం తరుపున అభివృద్ధికి ముందడుగు వేస్తున్నామన్నారు. పరిశ్రమల విస్తరింపు, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, మౌళిక సదుపాయాలు, భద్రతా చర్యలను అవసరమైన సహకారం అందించడానికి జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. పరిశ్రమల్లో నైపుణ్య అభివృద్ధి, ఉత్పత్తి ప్రమాణాల మెరుగుదల, మార్కెటింగ్ అవకాశాల విస్తరణ వంటి అంశాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రానైట్ పరిశ్రమ జిల్లాలో వేలాది మంది కుటుంబాల జీవన ఆధారమని, పరిశ్రమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారం అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. పరిశ్రమ బలోపేతం ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఖమ్మం అభివృద్ధి కోసం గ్రానైట్ పరిశ్రమల పురోగతి అత్యవసరమని, ఈ ప్రాంత యువతకు పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించడానికి ప్రతిష్టాత్మకంగా ప్రణాళికను రూపొందిస్తుందని తెలిపారు. చిన్న స్థాయి పారిశ్రామిక సంస్థలు తమ వ్యాపారాలను ప్రారంభించి, నడిపించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తూ అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థను బలంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని, గ్రానైట్ యాజమాన్యం వాతావరణం కాలుష్య నివారణకు ఆదేశాలను పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రతలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలు శాఖ జనరల్ మేనేజర్ సీతారాం నాయక్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, టిజి ఐఐసి డిఈ స్మరత్ చంద్ర, జెఈ శివకుమార్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దారు సైదులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ సీనియర్ రచయిత రామిశెట్టి రోశయ్యను పరామర్శించిన స్ఫూర్తి గ్రూప్

**ఏ ఎస్ రావు నగర్,డిసెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూపు ఆధ్వర్యంలో సోమవారం ప్రముఖ సీనియర్ రచయిత రామిశెట్టి రోశయ్య ని వారి నివాసంలో పరామర్శించారు. గత కొద్ది రోజుల క్రితం ఆయన కాళ్లు జారి పడటం వల్ల మొఖం, తలపై గాయాలు ఏర్పడడంతో చికిత్స పొందిన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం భవాని నగర్‌లోని మనుమడు రామిశెట్టి చైతన్య ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంలో స్ఫూర్తి గ్రూప్ సభ్యులు కలిసి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తి ప్రచురణ 'మేము సైతం' మరియు జ్యోతిరావు పూలే రచించిన 'గులాం గిరి' పుస్తకాలను రోశయ్యకు అందించారు. కార్యక్రమాన్ని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు సమన్వయపరిచారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీనియర్ నాయకుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రోశయ్య వివక్ష, దోపిడీలకు వ్యతిరేకంగా తన గళాన్ని, కలాన్ని వినియోగించిన గొప్ప యోధుడని అన్నారు. రైతాంగ సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టు భావాలతో పోరాటాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. హిందీ పండిట్‌గా ఉపాధ్యాయ వృత్తి చేసినప్పటికీ తెలుగులో దాదాపు 40కు పైగా పుస్తకాలు రచించడం విశేషమని పేర్కొన్నారు.రోశయ్య మాట్లాడుతూ తాను 100వ ఏట కూడా రచనా వ్యాసంగం కొనసాగించడానికి అందరి ప్రోత్సాహమే బలం అని, త్వరలో మరిన్ని రచనలు తీసుకువస్తానని తెలియజేశారు. ఆయన ఆరోగ్యం మరింత మెరుగుపడాలని సభ్యులందరూ ఆకాంక్షించారు. అలాగే మనుమడు చైతన్య తన తాత గారిని ఎంతో ప్రేమతో చూసుకుంటున్న తీరు ప్రశంసార్హమని అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గొడుగు యాదగిరి రావు, కృష్ణమాచారి, ఎం. భాస్కర్ రావు, శివరామకృష్ణ, జయరాజ్, గుమ్మడి హరిప్రసాద్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# గట్ల ఖానాపూర్‌లో సర్పంచ్ ఎన్నికల ప్రచారం జోరుగా

**పెద్దమందడి,డిసెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ గ్రామంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల ప్రచారం వేగంగా కొనసాగుతోంది. స్థానిక బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లక్ష్మి శ్రీనివాస్ యాదవ్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు వారి అభిప్రాయాలను తెలియజేస్తున్నారు.ప్రచారంలో,గ్రామంలో ఆడపిల్ల పుట్టిన సందర్భంలో 5,016 రూపాయల డిపాజిట్ ఇవ్వబడే హామీతో కొన్ని కుటుంబాలను కలిశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అభ్యర్థికి మద్దతు లభిస్తున్నట్టు వెల్లడించారు.గ్రామ అభివృద్ధి, నీటి, విద్య మరియు మౌలిక సదుపాయాల పనులపై ప్రాధాన్యం పెట్టి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గ్రామంలోని సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని, స్థానిక అభివృద్ధి పై దృష్టి పెట్టి పనిచేస్తామని పేర్కొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థి మేకల రాములు




**పెద్దమందడి,డిసెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మేకల రాములు ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన ఆయనకు గ్రామస్థుల నుండి విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తానన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసిన రాములు, గ్రామ అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం. అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కేటాయించిన టూత్ పేస్ట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.మద్దిగట్ల గ్రామ ప్రజల ఆశీర్వాదాలతో ఎమ్మెల్యే మేఘా రెడ్డి నాయకత్వంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తానని మేకల రాములు నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
మీరు కోరుకుంటే ఈ వార్తను మరింత సంక్షిప్తంగా, విస్తృతంగా లేదా ప్రచార పత్రిక శైలిలో కూడా మార్చి ఇస్తాను.

# గ్రామాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తా**

**పెద్దమందడి,డిసెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** గత 40 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు ఏ ఆపద వచ్చిన తక్షణమే స్పందిస్తూన్న నేను మీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి 24 గంటలు మీకు అందుబాటులో ఉంటానని ఒక్కసారి గ్రామ సర్పంచ్ గా ఉంగరం గుర్తు పై ఓటు వేసి గెలిపించినట్లయితే అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని అమ్మపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గౌని మాధవి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.సోమవారం ఆమె అమ్మాపల్లి గ్రామ ఇంటింటి ప్రచారం అనంతరం అమ్మపల్లి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాలతో గ్రామ పెద్దల కోరిక మేరకు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తుననీ వారు తెలిపారు. గ్రామంలో అర్ధరాత్రి ఏ ఆపతి వచ్చిన ఏ ఆలోచన చేయకుండా మీ కష్టాలను మా కష్టాలుగా భావించి భారం మోస్తూ ఎల్లవేళల అండగా ఉంటానని అన్నారు.గతంలో స్థానిక సంస్థ ఎన్నికలైన ఎంపీటీసీ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో 12 ఓట్ల మెజారిటీతో ఓటమి పాలుకావడం జరిగింది. ఈసారి రిజర్వేషన్ కలిసిరావడంతో నేడు సర్పంచ్ అభ్యర్థిగా గౌని మాధవి వెంకటేశ్వర్ రెడ్డి ఉంగరం గుర్తు బరిలో వున్నని తెలిపారు.ఈ ఒక్క సారి ఈ నెల 11న జరుగు సర్పంచ్ ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటు ఉంగరం గుర్తు పై వేసి గెలిపించి ఆశీర్వదిస్తారని ప్రజలను కోరారు.గ్రామ ప్రజలందరూ మీరు గెలిపిస్తే సొంత బిడ్డల చూసుకుంటానని హామీ ఇస్తానని అన్నారు.

# విద్యా అభివృద్ధిపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**న్యూ ఢిల్లీ,డిసెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల సదుపాయాల విస్తరణ, ఉన్నత విద్య ప్రమాణాలు, అలాగే
ఎస్సి/ఎస్టీ విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రోత్సాహక పథకాల అమలుపై కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోకసభలో ప్రశ్నించారు. వీటికి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సభలో సమాధానమిచ్చారు.మంత్రి వివరాల ప్రకారం, కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి (ఆర్ యూఎస్ఏ) పథకం కింద 50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో పరిశోధన కేంద్రాలు, నూతన ఆవిష్కరణల కార్యక్రమాలు, యువతకు మార్గదర్శకంగా నిలిచే పారిశ్రామిక ప్రవేశ హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా (పిఎంయూఎస్ హెచ్ఏ) పథకం కింద కాకతీయ విశ్వవిద్యాలయం, హనుమకొండలోని కాకతీయ పురుషుల డిగ్రీ కళాశాల, వడ్డేపల్లిలోని పింగళి మహిళా డిగ్రీ కళాశాలకు కలిపి 56 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో వసతి గృహాలు, తరగతి గదులు, ప్రాథమిక సౌకర్యాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.
పాఠశాలల అభివృద్ధి విషయంలో వరంగల్ జిల్లాలోని 16 పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేసినట్లు మంత్రి చెప్పారు. ఎస్సి/ఎస్టి
విద్యార్థులకు ఈ సంవత్సరం తెలంగాణలో ₹38 కోట్లు పైగా ప్రోత్సాహకాలు అందించగా, అందులో వరంగల్ జిల్లాకు చెందిన 144 మంది విద్యార్థులకు ₹0.31 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.
అదనంగా, కాకతీయ విశ్వవిద్యాలయంలో 450 సీట్ల వసతి సామర్థ్యం కలిగిన రెండు హాస్టళ్ల నిర్మాణానికి ₹9 కోట్లు ఆమోదించబడినట్లు మంత్రి వివరించారు.జిల్లాలో విద్యార్థుల మానివేత తీవ్రంగా ఉన్నదని ఎంపీ డాక్టర్ కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 2023-24 సంవత్సరంలో సెకండరీ స్థాయిలో 22.45% మంది విద్యార్థులు చదువు మానడం ఆందోళనకరమని చెప్పారు. ఈ పరిస్థితిని తగ్గించేందుకు విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.
విద్యారంగమే దేశ అభివృద్ధికి పునాది అని, విద్యా బలోపేతం జరిగితేనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాలో పాఠశాలల అభివృద్ధి, డ్రాపౌట్ల తగ్గింపు, ఎస్సి/ఎస్టీ విద్యార్థుల ప్రోత్సాహంపై కేంద్ర ప్రభుత్వం శీఘ్ర చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ఈ నెల 21న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి...

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్




**ఖమ్మం బ్యూరో, డిసెంబర్- 08, (తెలంగాణ ముచ్చట్లు):** ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కం న్యాయ సేవా సదన్ చైర్మన్ జీ. రాజగోపాల్ అన్నారు.
రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను సారం సోమవారం న్యాయ సేవా సదన్ లో ఇంచార్జ్ కార్యదర్శి ఎం. కల్పన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు, దీనిలో రాజీ పడదగిన అన్ని క్రిమినల్, మోటార్ ప్రమాద, చెక్ బౌన్స్, బ్యాంక్, మనోవర్తి కేసులు, సివిల్ కేసులు ఈ లోక్ అదాలత్ లో పరిష్కరిస్తారని, ఈ లోక్ అదాలత్ లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. మోటర్ ప్రమాద కేసులలో ఇన్సూరెన్స్ కంపెనీలు మానవతా కోణంలో ఆలోచించి త్వరితగతిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేయాలన్నారు. కక్షిదారుల విలువైన సమయం, డబ్బు వృధా కాకుండా శాశ్వత అంతిమ పరిష్కారానికి లోక్ అదాలత్ ను ఆశ్రయించాలన్నారు. సివిల్ కేసులలో రాజీ పడడం ద్వారా చెల్లించినటువంటి కోర్టు ఫీజులు సైతం తిరిగి పొందవచ్చు అన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని ఇందులో పరిష్కరించుకుంటే అప్పిలుకు వెళ్లే అవకాశం కూడా లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టం న్యాయంపై అవగాహన లేనివారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ లో రాజీ పడితే ఇరుపక్షాలు గెలుపొందినట్లే అన్నారు. 695 క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు 450, బ్యాంకు కేసులు 100, భార్యాభర్తలకు సంబంధించిన కేసులు 150, మోటర్ ప్రమాద కేసులో 180, సివిల్ దావాలు 295, ఇతర కేసులు 2000 ఇప్పటి వరకు గుర్తించినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ ను విజయవంతం చేయవలసిందిగా కోరారు.
ఈ కార్యక్రమంలో రెండవ అదనపు న్యాయమూర్తి వెంపటి అపర్ణ, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఇన్సూరెన్స్ న్యాయవాదులు గంగాధర్, సీత రామారావు, రాము, గుప్తా, పోలీసులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

**వేలేరు,డిసెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి వేడెక్కుతోంది. సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు ఇంటింటికీ ప్రజల మద్దతు కోరుతూ పర్యటిస్తున్న తరుణంలో, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరుతున్న దృశ్యం కనిపిస్తోంది.గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రధాన లక్ష్యమని నమ్మిన పలువురు నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీని ఎంచుకున్నట్లు తెలిసింది. చేరికల సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు కొత్తగా చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామ నాయకులు మాట్లాడుతూ, అభివృద్ధి మార్గాన్ని బలంగా చూపగలిగేది బీఆర్ఎస్ పార్టీనే అన్న విశ్వాసంతో ప్రజలు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న వేళ ఈ చేరికలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని వారు తెలిపారు.గ్రామంలోని యువత, మహిళలు, పెద్దలు కూడా బీఆర్ఎస్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నట్లు సమాచారం. ఎన్నికల శోభ పీచర గ్రామంలో రోజురోజుకూ మరింత పెరుగుతోంది.

# 1064 టోల్ ఫ్రీ నెంబర్ తో అవినీతికి అడ్డుకట్ట...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి







**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని పోస్టర్ లను, అవినీతి నిర్మూలన నినాదంతో కూడిన క్యూ ఆర్ కోడ్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జవాబుదారితనంతో ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మనమంతా నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ సూచించారు. అవినీతి అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలను ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కు అని, ఆ హక్కును లంచంతో కొనవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ పని కోసం ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసిబి డిఎస్పి వై. రమేష్, సీఐ బి. బాలాజీ, అధికారులు, పాల్గొన్నారు.

# రూ. 390 నుంచి 8,880 కి పెరిగిన షేర్ ధర
## ఐదేళ్లలోనే లక్షకు రూ. 23 లక్షలు




పెట్టుబడులు పెట్టాలని చాలా మందికి ఉంటుంది. కానీ ఎప్పుడు ఎక్కడ ఎలా ఎంత ఇన్వెస్ట్ చేయాలి.. రిస్క్ ఎలా ఉంటుంది.. రిస్క్ లేకుండా రిటర్న్స్ ఎలా వస్తాయో సరైన అవగాహన లేక చాలా మంది ఆదిలోనే ఆగిపోతుంటారు. స్టాక్ మార్కెట్ విషయానికి వస్తే.. దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ ఇస్తాయని చెప్పొచ్చు. నిపుణులు కూడా ఇదే చెబుతుంటారు. కానీ.. రిస్క్ కూడా ఉంటుంది. రిస్క్‌ను తట్టుకోగలిగిన వారు.. దీర్ఘకాలంలో మెరుగైన రాబడి కోసం వీటిని పరిశీలించొచ్చని చెబుతుంటారు. అయితే అంత మాత్రాన ఏ స్టాక్ పడితే దాంట్లో ఇన్వెస్ట్ చేస్తామంటే కుదరదు. ఇక్కడ స్టాక్ మార్కెట్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి. అన్నింటినీ గమనిస్తూ.. సరైన సమయంలో సరైన స్టాక్ ఎంచుకొని నిపుణుల నుంచి సలహాలు తీసుకొని పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మంచి లాభాలు అందుకునేందుకు అవకాశం ఉంటుంది. కొన్ని స్టాక్స్ దీర్ఘకాలంలో ఊహించని రీతిలో పెరుగుతూ.. ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందిస్తుంటాయి. అలానే కాసుల పంట పండించిన ఒక మల్టీబ్యాగర్ స్టాక్ గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. అదే ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ కంపెనీ అపార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్. ఈ కంపెనీ విషయానికి వస్తే.. ఇండియాలోనే కాకుండా గ్లోబల్ లీడర్‌గా ఉంది. కండక్టర్లు, కేబుల్స్, ఆయిల్స్, పాలీమర్స్, లూబ్రికెంట్స్ తయారీ, సరఫరాదారుగా ఉంది. ఈ స్టాక్ దీర్ఘకాలంలో అద్భుతంగా రాణించింది. శుక్రవారం సెషన్‌లో ఈ స్టాక్ ధర స్వల్పంగా 0.37 శాతం పెరిగి రూ. 8,880 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 35.75 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 11,779 గా ఉండగా.. కనిష్ట ధర రూ. 4,308.05 గా ఉంది. ఇటీవల స్వల్ప కాలంలో కాస్త నిరాశపర్చినప్పటికీ.. దీర్ఘకాలంలో మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించింది. సరిగ్గా ఐదేళ్ల కిందట అంటే 2020 డిసెంబర్ 11న చూస్తే ఈ స్టాక్ ధర రూ. 390 స్థాయిలో కదలాడింది. ఇప్పుడు రూ. 8,880 స్థాయికి చేరింది. అంటే ఈ ఐదేళ్ల వ్యవధిలో స్టాక్ ధర రికార్డు స్థాయిలో 2,179 శాతం పెరిగింది.

# మరోసారి రూపాయి విలువ పతనం



మరోసారి రూపాయి విలువ పతనం అయింది. ఈ రోజు ప్రారంభ ట్రేడింగ్‌లో భారత రూపాయికి ఒత్తిడి ఎదురైంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 12 పైసలు పడిపోయి.. 90.07 వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరగడం, దిగుమతిదారులు, కార్పొరేట్‌ల నుండి పెరుగుతున్న డాలర్ కొనుగోళ్లు రూపాయి బలహీనపడటానికి ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకోవడం కూడా రూపాయిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం రూపాయిపై మరింత ఒత్తిడి పెంచుతుంది. చమురు దిగుమతులు ఖరీదైనవిగా మారడం వలన దేశ ఆర్థిక భారం పెరుగుతుంది. అంతేకాకుండా, భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలపై నెలకొన్న జాప్యం కూడా రూపాయి సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ అంశాలన్నీ రూపాయి విలువను మరింత క్షీణించేలా చేశాయని నిపుణులు భావిస్తున్నారు.

# రూ.9 లక్షల కోట్లకు ఎస్‌బీఐ గృహ రుణాలు




ఈ ఏడాది నవంబరులో తమ తనఖా (గృహ) రుణాల విలువ రూ.9 లక్షల కోట్లను అధిగమించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. రిటెయిల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ (ఆర్‌ఏఎం) విభాగంలో జోరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రుణాల వృద్ధి 14 శాతానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం రుణాల్లో ఆర్‌ఏఎం వాటా 67% కాగా, సెప్టెంబరులో ఇవి రూ.25 లక్షల కోట్ల మైలురాయిని మించాయి. 'దేశ ఆర్థిక వృద్ధి మెరుగుపడటంతో, 202526కు రుణాల వృద్ధి లక్ష్యాన్ని 12% నుంచి 14 శాతానికి పెంచాం. ఆర్‌ఏఎం విభాగం చూస్తే.. ఎంఎస్‌ఎంఈ విభాగం 1718%, వ్యవసాయం, రిటెయిల్ విభాగాలు దాదాపు 14% చొప్పున వృద్ధి సాధిస్తున్నాయి' అని శెట్టి వెల్లడించారు.
పసిడి తనఖా రుణాల్లో బ్యాంక్ మంచి వృద్ధి సాధిస్తోందని, వ్యక్తిగత రుణాలు కూడా రెండంకెల వృద్ధి నమోదుచేయొచ్చని అన్నారు. కార్పొరేట్ రుణాలు కూడా దిగువ రెండంకెల వృద్ధిని సాధించొచ్చని తెలిపారు. దీంతో మొత్తంగా రుణాల వృద్ధి 1214% సాధ్యమేనని ధీమా వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ తాజాగా రెపో రేటులో 0.25% కోత విధించినా.. 3% నికర వడ్డీ మార్జిన్ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.

# భారీగా విలువ కోల్పోయిన ఇండిగో షేర్లు




వైమానిక సేవల సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీగా పతనం అవుతున్నాయి. ఇప్పటికే గత ఐదు సెషన్లలో 9 శాతానికి పైగా విలువ కోల్పోయాయి. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలో ఒక్కసారిగా 7శాతం పతనమైంది. ఆ తర్వాత కొద్దిగా కోలుకొంది. ఉదయం 10 గంటల సమయంలో 3.92 శాతం (రూ.210.50) నష్టంతో రూ.5,160 వద్ద ట్రేడవుతున్నాయి. డీజీసీఏ నూతన ఎఫ్‌డీటీఎల్ నిబంధనలకు అనుగుణంగా సిద్ధం కావడంలో ఇండిగో వైఫల్యం చెందింది. దీంతో గత కొన్ని రోజులుగా ఆ కంపెనీకి చెందిన వందల విమానాలు రద్దయ్యాయి. ఎట్టకేలకు సోమవారం నుంచి సంస్థ కార్యకలాపాలు మెల్లగా సాధారణ స్థితికి చేరుకోవడం మొదలుపెట్టాయి. సోమవారం ఆ కంపెనీ 1,650 విమానాలను నడిపింది. రద్దైన, తీవ్రంగా ఆలస్యమైన విమానాలకు సంబంధించి ఇప్పటివరకు రిఫండ్ల రూపంలో ఇండిగో.. రూ.610 కోట్లు విడుదల చేసిందని ప్రభుత్వం ఆదివారం వెల్లడించింది. మూడు వేల బ్యాగేజీలను కూడా ప్రయాణికులకు అప్పగించిందని తెలిపింది.

# ఎస్సీ-ఎస్టీ అభ్యున్నతికి కొత్త కమిటీ ఏర్పాటు.!

**సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఏకగ్రీవ ఎన్నికలు**



**సత్తుపల్లి, డిసెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఎస్సీ-ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో జిల్లా కమిటీ సెక్రటరీ ఎన్. నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పప్పుల రాఘవులు అధ్యక్షుడిగా, కల్లేపల్లి సర్వేశ్వరరావు కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్‌గా పప్పుల రాఘవులు, సెక్రటరీగా కల్లేపల్లి సర్వేశ్వరరావు, ట్రెజరర్‌గా మంచినీళ్ల ముత్తయ్య, జాయింట్ సెక్రటరీగా వేల్పుల వెంకట రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా నార్లపాటి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాలోతు వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా కిన్నెర ఆనందరావు, గౌరవ సలహాదారుగా జొన్నలగడ్డ వెంకటయ్యలు బాధ్యతలు చేపట్టారు. అలాగే జొన్నలగడ్డ జగన్నాథం జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
నూతనంగా ఎన్నికైన అధ్యక్ష-కార్యదర్శులు మాట్లాడుతూ, డిపోలోని ఎస్సీ-ఎస్టీ కార్మికుల సమస్యలను యాజమాన్యానికి తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్మికుల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, డిపో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేగవంతంగా పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆర్.టి. రావు, కె.ఎన్. రావు, కోట నల్లయ్య, పి. ఇజ్రాయిల్, బాలరావు, అనిల్ బాబు, సత్తిబాబు, వి.వి. రమణ, రాంబాబు, జి. రవికుమార్, రత్నాకర్, హుస్సేన్, ముత్తయ్య, రత్నరాజు, టీ. వెంకటకృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

# కొత్త ఏడాదిలో బంగారం ధర ఎలా ఉంటుంది?

బంగారం ధరలు గణనీయంగా తగ్గే అవకాశం తక్కువగానే ఉన్నాయంటున్నారు. ధరలు తగ్గినప్పుడల్లా భారతదేశం, ఆసియా ఆభరణాల మార్కెట్లు, దీర్ఘకాలిక పెట్టుబడిదారులు తమ కొనుగోళ్లను పెంచుకుంటారని, ఇది ధరలకు మద్దతు ఇస్తుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది. 2025 ప్రారంభం నుండి, బంగారం ధరలు క్రమంగా పెరిగాయి. వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. 2025 లో అత్యధిక దిగుబడినిచ్చే ఆస్తులలో బంగారం ఒకటి. పెరుగుతున్న బంగారం, వెండి ధరల వల్ల మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ప్రభావితమయ్యారు. తత్ఫలితంగా, 2026 కొత్త సంవత్సరంలో బంగారం ధరలు ఎలా ఉంటాయో అని అందరూ ఆలోచిస్తున్నారు. ప్రపంచ బంగారు మండలి ఇప్పుడు బంగారం రేటుకు సంబంధించి ముఖ్యమైన సమాచారాన్ని అందించింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చే ఏడాది బంగారం ధరలను పెంచడానికి మూడు కీలక అంశాలు దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికాలో వడ్డీ రేటు కోతలు, అలాగే పెట్టుబడిదారులు సురక్షిత స్వర్గధామాల కోసం వెతుకులాట. ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే బంగారం దాని ప్రస్తుత స్థాయి కంటే 15% నుండి 30% వరకు ఖరీదైనదిగా మారవచ్చు. ఇది సాధారణ కుటుంబాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. వచ్చే ఏడాది పెళ్లిళ్లు ప్లాన్ చేసుకునే కుటుంబాలు నగల కోసం ఎక్కువ బడ్జెట్ చేయాల్సి రావచ్చు.




# భూక్యా వీరస్వామి కుటుంబానికి పి.ఎస్.ఆర్ ట్రస్ట్ నుండి ఆర్థిక సహాయం..

- **సోమవారం తన స్వగ్రామంలో తుదిశ్వాస విడిచిన భూక్యా వీరస్వామి**
- **కమ్యూనిస్టు సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడి నిలిచిన వీరస్వామి**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 8,(తెలంగాణ ముచ్చట్లు):** అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ కమ్యూనిస్టు కార్యకర్త భూక్యా వీరస్వామి కుటుంబానికి పి.ఎస్.ఆర్ ట్రస్ట్ తరఫున రూపాయలు పదివేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా వీరస్వామి నిరంతర పార్టీ సేవలు, ప్రజల పట్ల ఉన్న అంకితభావం గురించి స్మరించుకున్నారు. భూక్యా వీరస్వామి చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు ఉద్యమంతో అనుబంధం ఏర్పరుచుకున్నారు. పేదలు, కూలీలు, గిరిజనులు——వారి సమస్యల కోసం ఎల్లప్పుడూ ముందుండి పోరాడే నాయకుడిగా ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించారు. సామాజిక న్యాయం, సమానత్వం అనే కమ్యూనిస్టు సిద్ధాంతాలపై విశ్వాసం ఉంచి, వాటిని జీవితాంతం ఆచరణలో పెట్టిన అరుదైన నాయకులలో వీరస్వామి ఒకరు. సిపిఐ పార్టీ పట్ల వీరస్వామి చూపిన విశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ పార్టీ విభాగంలోనే కాక ప్రజల మధ్య కూడా మంచి పేరు తెచ్చాయి. జీవితంలో ఎన్నో కష్టాలు వచ్చినా పార్టీ పట్ల ఉన్న అంకితభావాన్ని ఎప్పుడూ తగ్గించలేదు. అనారోగ్యంతో జరిగిన పోరాటంలో కూడా ఆయన మనోధైర్యం చాటుకున్నారు. చివరి శ్వాస తీసుకునే వరకు కమ్యూనిస్టు ఉద్యమం కోసం ఆలోచిస్తూ, ప్రజల కోసం ఆందోళన చెందుతూ జీవించారు. అతని మరణం గ్రామానికి, పార్టీకి, ప్రజా ఉద్యమాలకు ఒక పెద్ద లోటు. భూక్యా వీరస్వామి జీవితం యువతకు ప్రేరణగా నిలుస్తుందనీ, ఆయన నడిచిన మార్గం ముందుకు సాగేందుకు దారికనుపెడుతుందనీ నాయకులు పేర్కొన్నారు.
పి.ఎస్.ఆర్ ట్రస్ట్ తరఫున అందించిన ఈ ఆర్థిక సహాయం కుటుంబానికి కొంత ఊరటనిస్తుందని, అలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని ట్రస్ట్ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్కూరు శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, ధోనేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి భూక్య శ్రీనివాస్, మొరపాక నాగయ్య, నల్లగట్టు సామేలు, భూక్యా శ్రవణ్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సభ్యులు ఉడుగుల మధు తదితరులు పాల్గొన్నారు.

# రుణ ఆధారిత షేర్లకు గిరాకీ!




దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం తీవ్ర ఆటుపోట్లకు గురయ్యాయి. ఈ క్రమంలోనే సూచీలు మిశ్రమంగా ముగిశాయి. అంతకు ముందు వారం ముగింపుతో చూస్తే.. సెన్సెక్స్ 5.70 పాయింట్లు పెరిగి 85,712.37 దగ్గర ఆగింది. అయితే నిఫ్టీ 16.50 పాయింట్లు కోల్పోయి 26,186.45 వద్ద నిలిచింది. నిజానికి వరుస నష్టాల్లో ఉన్న మార్కెట్లకు ఆర్బీఐ రెపోరేటు తగ్గింపు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. చివరిరోజు భారీ లాభాలే నిదర్శనం. ఈ నేపథ్యంలో ఈ వారంలోనూ ఆర్బీఐ జోష్ ట్రేడింగ్‌లో కనిపించవచ్చని మెజారిటీ ఎక్స్‌పర్టస్ మాట. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ తదితర ఆర్బీఐ రెపోరేటు ఆధారిత షేర్లు మదుపరులను ఆకట్టుకోవచ్చు. ఇదే జరిగితే సూచీలు ఆల్‌టైమ్ హై రికార్డుల్లోకి వెళ్లడం ఖాయమనే చెప్పాలి. అయితే ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పెద్దపీట వేసే వీలుకూడా లేకపోలేదు. ఇక ఎప్పట్లాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, ఇతర అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, రూపాయి పతనం కొనసాగుతుండటంతో సెల్లింగ్ ప్రెషర్ సహజంగానే ఉంటుంది. అలాగే రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన నేపథ్యంలో అంతర్జాతీయంగా అమెరికా వేసే ఎత్తులు కూడా సూచీలను ప్రభావితం చేయవచ్చు. ఇక అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,900 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 25,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల అభిప్రాయం. సూచీలు పరుగందుకుంటే నిఫ్టీ 26,40026,600 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)



సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు. పెట్టుబడులు, ఉపాధి, ఇన్నోవేషన్ ప్రధాన లక్ష్యంగా 27 అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడిరచారు. వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ కొనసాగుతోందన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో స్థిరమైన, పారదర్శకమైన ప్రభుత్వం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని నోబెల్ అవార్డు గ్రహీత కైలాశ్ సత్యార్థి తెలిపారు. తెలంగాణ ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో 20 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. సంస్కృతి,కళలు,టెక్నాలజీ,పరిశ్రమల హబ్‌గా తెలంగాణ ఉందన్నారు. ఐకమత్యంతోపాటు శాంతియుత పరిస్థితులతోనే అభివృద్ధి సాధ్యమని కైలాశ్ సత్యార్థి వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం ప్రారంభమైంది. ఈ సమ్మిట్ మంగళవారంతో ముగియనుంది. ఈ సమ్మిట్‌కు సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు కేంద్ర మంత్రులు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తోపాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. దాదాపు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు, అతిథులు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు. దేశ, విదేశీ ప్రముఖులు ఈ సమ్మిట్‌కు హాజరయిన నేపథ్యంలో భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

# రెండు రోజులపాటు ట్రాఫిక్ మళ్లింపు

- రెండు రోజులపాటు ట్రాఫిక్ మళ్లింపు
- సమ్మిట్ చుట్టూ భారీగా బందోబస్త్ ఏర్పాటు

హైదరాబాద్,డిసెంబర్8 (తెలంగాణ ముచ్చట్లు):




తెలంగాణ రైజింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న గ్లోబర్ సమ్మిట్ ప్రారంభమయ్యింది. ఈ సదస్సుకు 44 దేశాల నుంచి 154మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం మధ్యాహ్నం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సమ్మిట్ వేధిక అయిన ఫ్యూచర్ సిటీలోని మీర్‌ఖాన్‌పేట పూర్తిగా భద్రతా వలయంలో వెళ్లింది. దేశ, విదేశాలకు చెందిన ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, దిగ్గజ పారిశ్రామిక కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కానుండటంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో మీర్‌ఖాన్‌పేట వచ్చే మార్గాల్లో సోమ, మంగళవారాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు, సాధారణ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. ప్రధానంగా హైదరాబాద్`శ్రీశైలం జాతీయ రహదారి (ఎన్‌హెచ్`765)లో వీడియోకాన్ జంక్షన్ నుంచి తుక్కుగూడ, నెహ్రూ ఔటర్ రోటరీ (ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబర్`14), హర్షగూడ, మహేశ్వరం గేట్, కొత్తూర్ క్రాస్ రోడ్స్, పవర్ గ్రిడ్ జంక్షన్ మార్గంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. కొత్తూర్ క్రాస్ రోడ్స్ నుంచి పెద్ద గోల్కొండ, ఓఆర్‌ఆర్ ఎగ్జిట్`15 మధ్య ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. ఔటర్ నుంచి ఎన్‌హెచ్`765 మీదుగా వచ్చే భారీ వాహనాలు తుక్కుగూడ ఔటర్ (ఎగ్జిట్ నంబర్`14) వద్ద కాకుండా పెద్ద గోల్కొండ, ఓఆర్‌ఆర్ (ఎగ్జిట్ 15) వద్ద మళ్లింపులు తీసుకోవాలని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడిరచారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, కమ్యూనికేషన్స్, ఇంటెలిజెన్స్, బెటాలియన్స్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఏఆర్, స్పెషల్ పార్టీ తదితర విభాగాల నుంచి మొత్తం 6 వేల మంది సిబ్బందిని మోహరించామని, వీరంతా రెండ్రోజులపాటు బందోబస్తు విధుల్లో ఉంటారని ప్రకటించారు. మొత్తం ఆరు అంచెల భద్రత నడుమ ఈ కార్యక్రమం జరుగుతుందని, సమ్మిట్ ప్రధాన వేదిక వద్ద ముగ్గురు అడిషనల్ డీజీలు, ఐదుగురు ఐజీపీలు, 10మంది ఐపీఎస్‌లు, 170మంది యువ పోలీస్ అధికారులు, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సాంకేతికతలో నిపుణులైన డీసీపీ స్థాయి సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తారని వివరించారు. పార్కింగ్ మేనేజ్‌మెంట్‌కు డీసీపీ స్థాయి అధికారులను నియమించామని, సభాప్రాంగణానికి వచ్చే వీవీఐపీల భద్రత కోసం స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, ఈవెంట్ సెక్యూరిటీ టీమ్‌లు ఉంటాయని తెలిపారు. వేదికతోపాటు వీవీఐపీలు వచ్చే మార్గాలు, పారింగ్ జోన్లలో 115 నైట్`విజన్, పీటీజెడ్ కెమెరాలు అమర్చామని, ఇవి ప్రధాన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయని పేర్కొన్నారు. టాఫిక్, భద్రత, సభా ప్రాంగణాన్ని పర్యవేక్షించేందుకు 10 డ్రోన్ బృందాలను మోహరించినట్టు తెలిపారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

## ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్ష






తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఎపి సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సమ్మిట్ దృష్ట్యా ట్విట్టర్ వేదికగా సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సదస్సు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి, ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం నుంచి రెండు రోజులపాటు అత్యంత వైభవంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే, గత మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతి నివాసంలో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసిన విషయం తెలిసిందే.

సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. తాను తప్పకుండా వస్తానని సీఎం చంద్రబాబు చెప్పారని కోమటిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు హాజరు కావాల్సిఉన్నా, ముందస్తు షెడ్యూల్ కారణంగా రాలేక పోయారు. హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఇందుకోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది అతిథులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానించింది. గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు ఆరు వేలమంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ గేటు నుంచి సమ్మిట్ వేదిక వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేస్తున్నారు. అతిథుల భద్రత దృష్ట్యా పోలీసులు ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టారు. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణకు ఎంతో విలువైన పెట్టుబడులు వస్తాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది.

# ఫ్యూచర్ సిటీ ఆలోచన అభినందనీయం


- సిఐఐ మాజీ ఛైర్మన్ దినేశ్ వెల్లడి
- ట్రంప్ మీడియా టెక్నాలజీస్ భారీ పెట్టుబడులు



హైదరాబాద్,డిసెంబర్ 8 (ఆర్‌ఎన్‌ఎ): ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని సీఐఐ మాజీ ఛైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం గొప్ప విషయమని, తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆదిలావుంటే తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్ వేదికగా సంస్థ డైరెక్టర్ ఎరిక్ ఈ మేరకు ప్రకటించారు. వచ్చే పదేళ్లలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడిరచారు. తెలంగాణ విజన్‌ను ఈ సమిట్ ప్రతిబింబిస్తోందని అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ అన్నారు. తెలంగాణలో ఇప్పటికే అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యువబుల్ ఎనర్జీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నాం. సిమెంట్ రంగంలో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెడుతోంది. డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో తొలిసారిగా యూఏవీ టెక్నాలజీ హైదరాబాద్‌లో రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌లో తయారయ్యే యూవీలను సైన్యానికి అందిస్తాం. ప్రపంచమార్కెట్‌లోనూ విక్రయిస్తాం. రూ.25వేల కోట్లతో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తాం. లాజిస్టిక్స్‌లో రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నిస్తోంది. రూ.4వేల కోట్లతో రహదారి సౌకర్యాలు కల్పించనున్నాం. రాష్ట్రంలో జిల్లాలను కలిపే రహదారులను అదానీ గ్రూప్ నిర్మిస్తోంది. రూ.2వేల కోట్లతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసిందని కరణ్ అదానీ పేర్కొన్నారు.

# మల్కాజిగిరి ప్రాంతంలో మరో రియల్టర్ హత్య


హైదరాబాద్,డిసెంబర్8 (తెలంగాణ ముచ్చట్లు):



హైదరాబాద్‌లో పట్టపగలే హత్యలు, దోపిడీలు, దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీలవల పాతబస్తీలో ఓ రియల్టర్ హత్యకు గురయ్యాడు. వరుస హత్యలు, దాడులతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా మల్కాజిగిరిలో జరిగిన రియల్టర్ హత్య కలకలం రేపింది. సోమవారం ఉదయం మల్కాజిగిలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సాకేత్ కాలనీ ఫోస్టర్ బిల్లాబాంగ్ స్కూల్ సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు. వెంకటరత్నం అనే రియల్టర్‌ను దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. స్కూటీపై వెళ్తున్న వెంకటరత్నంను వెంబడిరచిన గుర్తుతెలియని వెక్తులు..కత్తులతో పొడిచి తుపాకీతో కాల్చి చంపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా, వెంకటరత్నంపై ధూల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉన్నట్లు గుర్తించారు. జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్నట్లు తేలింది. ఆయనను ప్రత్యర్థులే చంపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రిది ప్రైవేట్ లిమిటెడ్ పాలన అని, తన రెండేండ్ల పాలనలో చేసింది ఒక్కటైనా చెప్పగలడా అని ప్రశ్నించారు. ప్రజాభవన్‌ను జల్సాలకు, విందులు, వినోదాలకు ప్రజాభవన్‌ను కేరాఫ్‌గా మార్చారు అంటూ ఘాటు విమర్శలు చేశారు. పార్టీ నేతలతో కలిసి రేవంత్ రెండేండ్ల పాలనపై తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. 'రేవంత్ పాలనలో రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత లేదు. ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ రెండేండ్లలో చేసిందేమీ లేదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారు. రెండేండ్ల పాలనలో రాష్ట్ర ఆదాయం ఎందుకు తగ్గింది?. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్

ప్రభుత్వం విఫలమైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. ప్రతీరోజు ప్రజల్ని కలుస్తానని రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఒక్క రోజు మాత్రమే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. నాలుగైదు రోజులు మంత్రులు వచ్చారు.. ఆ తర్వాత వాళ్లు కూడా పత్తా లేరు. ఆ దరఖాస్తులను పట్టించుకున్న నాథుడే లేడు. మేనిఫెస్టోలోని మొదటి కార్యక్రమం, రేవంత్ రెడ్డి మొదటి మాటే తుస్సుమంది. ప్రజా భవన్‌ను జల్సాలకు, విందులకు, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. పొద్దుగాల బ్రేక్‌ఫాస్ట్ మీటింగులు.. మధ్యాహ్నం సెటిల్‌మెంట్లు.. సాయంత్రం గానా భజానాలు, సంగీత్‌లు, ఎంగేజ్‌మెంట్లు, విందులు వినోదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన గొడుగు నాగరాజు అనే రైతు తనకు సమస్య ఉందని ప్రజా భవన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతని ఫోన్‌కు సమస్య పరిష్కారం అయిందని మెసేజ్ వచ్చింది.. కానీ ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దితే, రేవంత్ రెడ్డి తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నాడు. కేసీఆర్ ప్రతి ఊరికి పల్లె దవాఖానాలు, పెద్ద పెద్ద ప్రభుత్వ హాస్పిటళ్లు కడితే, రేవంత్ రెడ్డి ప్రతి ఊరికి ఒక బారు, పబ్ పెట్టుకోమని చెప్తున్నాడు. ఐటీఐకి, ఐఐటీ, ఐఐఐటీకి తేడా కూడా తెలియని మూర్ఖుడు ఈరోజు ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్నాడు. కల్యాణలక్ష్మి చెక్కులు తీసుకునేందుకు మహిళలు వారి పిల్లలతో వస్తున్నారు. పెళ్లికి సహాయం చేస్తున్నావా లేక పిల్లల 21వ రోజుకు సహాయం చేస్తున్నావా?. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకానికి ఇవ్వాల్సిన రూ.980 కోట్ల నిధులు పెండిరగ్‌లో పెట్టింది. అవినీతి ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలి. కరప్షన్ నేర్పడానికి కాలేజీ పెడితే.. తెలంగాణ కాంగ్రెస్ కరప్షన్ పాలనను ఒక సిలబస్ మోడల్‌గా పెట్టొచ్చు. భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్, ఉత్తమ్, ఆర్‌ఆర్ ట్యాక్స్ తీసుకువచ్చారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలి. రెండేండ్లలో నువ్వు జర్నలిస్టులకు చేసింది ఏందన్నారు. . ఒక్క అక్రిడేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. జర్నలిస్టుల సంక్షేమాలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చావా' అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896